సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ విజయవాడ సంచాలకుల ఆధ్వర్యాన యుపిఎస్‌సి నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రాథమిక, తుది పరీక్షలకు విజయవాడలోని బిసి స్టడీ సర్కిల్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్.నాగరాణి తెలిపారు. ఏలూరు జిల్లాకు చెందిన అర్హులైన బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్క్స్ జాబితాలు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 24వ తేదీలోపు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికార కార్యాలయం, కలెక్టరేట్ కాంపౌండ్, ఏలూరుకు దరఖాస్తులు పంపాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందన్నారు.

డెల్టా ఆధునికీకరణ కదిలేనా..!

- ఐదేళ్లుగా పడకేసిన పనులు
- పంట కాల్వలు పూడుకుపోయి
- నీరు పారని దుస్థితి
- ప్రతియేటా వర్షాలకు వేల ఎకరాల్లో పంట ముంపు
- రెండు జిల్లాల్లో రూ.470 కోట్లు విలువైన
- పనులకు ప్రతిపాదనలు
- ఏప్రిల్ 15న కాలువల మూసివేతకు
- జిల్లాసాగునీటి సలహామండలిలో నిర్ణయం
- జనవరిలో టెండర్లు పిలిస్తేనా పనులు ముందుకు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 80 శాతం వ్యవసాయమే జీవనాధారం. వ్యవసాయ రంగానికి అత్యంత ప్రధానమైన డెల్టాలోని పంట కాలువల ఆధునికీకరణ గురించి మాత్రం ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రతియేటా వర్షాలు, వరదలు, తుపాన్లకు వేలాది ఎకరాల్లో పంట నష్టపోయి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో మూడుసార్లు విరుచుకుపడిన వరదలు, వర్షాలకు 29 వేల ఎకరాల్లో పంటను రైతులు కోల్పోయారు. రూ.27 కోట్లు మేర పంట నష్టం అందించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. వైసిపి ఐదేళ్ల పాలనలో డెల్టా ఆధునికీకరణ ఊసే లేకుండాపోయింది. దీంతో పంట కాలువలన్నీ మెరకదేరి నీరు కిందకు పారని దుస్థితి నెలకొంది. చిన్నపాటి వర్షానికి సైతం పంట పొలాలు మునిగిపోతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు 11 ప్రధాన కాలువలు, 300కుపైగా ఉపకాలువ ద్వారా సాగునీరు అందుతోంది. రెండు జిల్లాల్లో దాదాపు ఐదు లక్షల ఎకరాల వరకూ డెల్టా ఆయకట్టుగా ఉంది. ప్రతియేటా డెల్టా ఆధునికీకరణ పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి అధికారులు ప్రభుత్వానికి నివేదించడం, వాటిని పాలకులు పక్కన పెట్టేయడం పరిపాటైంది. ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో ఖరీఫ్‌లో వరదల ముంపు, దాళ్వాలో సాగునీటి ఎద్దడి సమస్యతో రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులు తూతూమంత్రంగా సాగించి చేతులు దులుపుకుంటున్న పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, జలవనరుల శాఖ మంత్రిగా జిల్లాకు చెందిన నిమ్మల రామానాయుడు ఉండటంతో ఈ ఏడాదైనా డెల్టా ఆధునికీకరణ పనులు జరిగేనా అనే చర్చ రైతుల్లో సాగుతోంది. డెల్టా ఆధునికీకరణ పనులు చేయాలంటే ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళిక అత్యంత ముఖ్యమనే చర్చ సాగుతోంది.

జనవరిలో టెండర్లు పూర్తయితేనే పనులు ముందుకు

ప్రతియేటా నవంబర్ మూడో వారంలో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశానికి మంత్రులు, ఎంఎల్‌ఎలు, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొంటారు. దాళ్వాకు సాగునీటి సరఫరా, తాగునీటికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపైనా, డెల్టా ఆధునికీకరణ పనులపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాగునీటి పారుదల సలహా మండలి సమావేశాలు మమ అన్నట్లు సాగుతున్నాయి. ఇప్పటికే పశ్చిమలో సాగునీటి సలహా మండలి సమావేశం పూర్తయ్యింది. ఏలూరు జిల్లాలో నిర్వహించాలని తలపెట్టి వాయిదా వేశారు. ఇక్కడ కూడా కొద్దిరోజుల్లో జరిగే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఆధునికీకరణ పనులపై చర్చ లేకుండాపోయింది. ఈ ఏడాది పశ్చిమలో రూ.310 కోట్లు, ఏలూరు జిల్లాలో దాదాపు రూ.160 కోట్లు విలువైన పనులకు సంబంధించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని ఆమోదిస్తేనే డెల్టా ఆధునికీకరణ పనులు జరిగే అవకాశం ఉంటుంది. డిసెంబర్ నెలాఖరులోపు ఆధునికీకరణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. అప్పుడే జనవరిలో టెండర్లు పిలిచేందుకు అవకాశం ఉంటుంది. జనవరిలోపు టెండర్ల ప్రక్రియ పూర్తయితేనే డెల్టా ఆధునికీకరణ పనులు ముందుకు సాగుతాయి. పశ్చిమలో జరిగిన జిల్లా సాగునీటి పారుదల సలహా మండలి సమావేశంలో ఏప్రిల్ 15న కాలువలు మూసివేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. మళ్లీ జూన్ ఒకటిన కాలువలకు నీరు విడుదల చేయనున్నారు. జనవరి నెలాఖరులోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తే కాలువలు మూసివేసిన వెంటనే ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోననే చర్చ రైతుల్లో సాగుతోంది. ఈ ఏడాదైనా డెల్టా ఆధునికీకరణ పనులు చేయాలని రైతులు కోరుతున్నారు.

నినదిస్తున్న అంగన్వాడీలు

మినీలను మెయిన్ సెంటర్లుగా మార్చండి

కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ ఆదేశాలు తక్షణమే విడుదల చేయాలని, 42 రోజుల సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు, ప్రమోషన్లు, వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ 42 రోజుల రాష్ట్రవ్యాప్త సమ్మె ముగిసి నేటికి ఎనిమిది నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రాతపూర్వక ఒప్పందం మేరకు ఏఒక్క డిమాండ్‌నూ నెరవేర్చలేదని విమర్శించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర అప్పులను కారణంగా చూపడం మానుకోవాలన్నారు. వర్కర్, హెల్పర్ ఇద్దరూ చేయాల్సిన పనులను ఒకరే చేస్తూ మినీ సెంటర్లను నిర్వహిస్తున్న మినీ వర్కర్లను బానిసలకంటే దారుణంగా పని చేయిస్తున్నారన్నారు. ఎటువంటి సెలవులూ లేకుండా వెట్టి చాకిరీ చేస్తున్నా ప్రభుత్వం కనికరించడం లేదని, సుప్రీంకోర్టు తీర్పును సైతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని చెబుతున్న అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. 42 రోజుల సమ్మె ఒప్పందం అమలు కోసం దశలవారీ పోరాటాలకు అంగన్వాడీలు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.విజయలక్ష్మి, జిల్లా కోశాధికారి టి.మాణిక్యం, జిల్లా నాయకులు సరళ, పి.హైమావతి, విమల, భూదేవి, మరియమ్మ, సుజాత, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల గోడు పట్టదా

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలవరం ప్రాజెక్టు పనులపై ఉన్న శ్రద్ధ, ఆ ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులపై లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. మండలంలోని కొత్తూరులో సిపిఎం మండల మహాసభ శనివారం నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని సిపిఎం సీనియర్ నాయకులు గుమ్మల వెంకటనరసయ్య ఆవిష్కరించారు. అనంతరం మడివి దుర్గారావు, కారం వెంకట్రావు, కుంజ దుర్గ అధ్యక్షతన సభ జరిగింది. తొలుత సీతారాం ఏచూరి, గండికోట సాంబయ్య, ఆర్ఎస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి రవి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా నిర్వాసితుల గోడు పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. సంవత్సరాలు తరబడి ప్రాజెక్టు కట్టడమేగాని నిర్వాసితుల సమస్యలు, పునరావాసం, పరిహారం గురించి చర్చే లేదని అన్నారు. సర్వేల పేరుతో కాలం గడపడమేగాని ఏఒక్క నిర్వాసితునికీ న్యాయం జరగట్లేదన్నారు. ప్రతి సంవత్సరం వరదలు వచ్చినప్పుడల్లా కొండ గుట్టలపై తల దాచుకుని జీవనం సాగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి, పూర్తి పునరావాసం కల్పించాలని, ఆ తర్వాతే ప్రాజెక్టు పనులు సాగించాలని అన్నారు. ఉచిత ఇసుక పాలసీని పటిష్టంగా అమలు చేయాలన్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు పెదవాగు ప్రాజెక్టుకు గండిపడి మేడిపల్లి, రామవరం పంచాయతీల పరిధిలోని గ్రామాలన్నీ సర్వనాశనమయ్యాయన్నారు. పంట భూముల్లో ఇసుక మేటలు వేశాయని, ఇళ్లు సైతం కొట్టుకుపోవడంతో అక్కడి ప్రజలు నిర్వాసితులయ్యారని చెప్పారు. ఆ రెండు పంచాయతీల పరిధిలోని ప్రజలకు పునరావాసం కల్పించి ప్యాకేజీ ఇవ్వాలన్నారు. అనంతరం మండల కార్యదర్శి ధర్ముల రమేష్ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.నాగమణి, నేతలు యర్నం సాయికిరణ్, బోయిన శ్రీను, మాడే ప్రసాద్‌రెడ్డి, దొంగ శ్రీను, మడకం అక్కమ్మ, సీతమ్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎ.రవి



నినదిస్తున్న క్లాప్ డ్రైవర్లు

బకాయి జీతాలివ్వాలని క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమకు రావాల్సిన బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) ఆటో డ్రైవర్లు శనివారం స్థానిక వంగాయగూడెంలోని నగరపాలక సంస్థ వెహికల్ డిపో వద్ద ధర్నా నిర్వహించారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు బకాయి జీతాలు చెల్లించాలని, సమ్మె వేతనాలు చెల్లించాలని, పాడైపోయిన ఆటోలు రిపేర్ చేయించాలని, పిఎఫ్, ఇఎస్ఐలు ఖాతాలో జమ చేయాలని నినదించారు. ఈ ధర్నానుద్దేశించి యూనియన్ నాయకులు రాజు, పుష్పరాజు మాట్లాడుతూ జీతాలు సకాలంలో రాక క్లాప్ ఆటో డ్రైవర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పనులు నిలుపుదల చేసి సమ్మె చేపడతామని హెచ్చరించారు. ప్రతి నెలా ఐదో తేదీలోపు జీతాలు చెల్లించాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి రాజు, హరీష్, సుగుణకుమార్, శ్రీను, పుష్పరాజు తదితరులు నాయకత్వం వహించారు. ధర్నా అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు.

రావి పద్మకుమారి మృతి పట్ల సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రముఖ వైద్యులు, జిల్లా ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రావి గోపాలకృష్ణయ్య భార్య రావి పద్మకుమారి మృతి పట్ల సిపిఎం సంతాపం తెలిపింది. పద్మకుమారి అనారోగ్య కారణంతో అకస్మాత్తుగా మృతి చెందడం పట్ల సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా రవి డాక్టర్ గోపాలకృష్ణయ్యను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గోపాలకృష్ణయ్య కమ్యూనిస్టు అభిమానిగా అనేక ఉద్యమాలకు, కార్యక్రమాలకు మద్దతు ఇస్తుంటారని తెలిపారు. ప్రముఖ వైద్యులుగా పేరొందడంతోపాటు సేవా తత్పరులని గుర్తుచేశారు. తన వృత్తి జీవితంలో అనేకమంది ప్రజలకు వైద్య సహాయాన్ని అందించారని తెలిపారు. భర్త గోపాలకృష్ణయ్యతో కలిసి అనేక సేవా కార్యక్రమాల్లో పద్మకుమారి కూడా పాలుపంచుకునే వారన్నారు. ముఖ్యంగా పద్మకుమారి పేద విద్యార్థులు, మహిళలకు సాధన ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. శుక్రవారం ఉదయం ఆకస్మికంగా పద్మకుమారి మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని కల్గించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మకుమారి మృతి పట్ల సంతాపం తెలిపిన వారిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం ఉన్నారు. పద్మకుమారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

లాప్రోస్కోపిక్ విధానంలో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

లాప్రోస్కోపిక్ విధానంలో అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు ఆశ్రం హాస్పిటల్స్ డాక్టర్ టివి.కృష్ణవర్ధన్ తెలిపారు. స్థానిక ఆసుపత్రిలో హిపోక్రాటిక్ హాలులో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. డాక్టర్ కృష్ణవర్ధన్ మాట్లాడుతూ నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన పాల్లూరి సత్యవతి (52) కర్నాటకలో నివాసం ఉంటున్నారు. అయితే డయాబెటిస్‌తో బాధపడుతున్న సత్యవతి తమను సంప్రదించిందని తెలిపారు. కొన్ని పరీక్షలు చేసిన తర్వాత ప్యాంక్రియాస్ గ్రంధిలో కంతి ఏర్పడినట్లు గుర్తించి, తక్షణమే సర్జరీ చేయించుకోవాలని సూచించామన్నారు. ఆమె అంగీకారం మేరకు లాప్రోస్కోపిక్ సర్జరీ ద్వారా కంతిని తొలగించామని తెలిపారు. ఆపరేషన్ జరిగిన రెండో రోజునే ఆమెను డిశ్చార్జి చేశామని వివరించారు. ఇటువంటి శస్త్ర చికిత్స ఏలూరు జిల్లాలో చేయడం ఇదే మొదటిసారి అని, దాని ఘనత ఆశ్రం హాస్పిటల్‌కు దక్కిందని తెలిపారు. ఈ చికిత్సలకు ఆరోగ్యశ్రీ వర్తిస్తుందన్నారు.

మాట్లాడుతున్న వైద్యులు

పనులు ప్రారంభించిన సర్పంచి

శ్రీహరిపురంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని శ్రీహరిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆచంట కుటుంబరావు ఇంటి వద్ద నుండి పిల్లి ప్రసాద్ ఇంటి వరకు 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు నీలం సుమతి, చీదేళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వై.శ్యామసుందర్, నీలం రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టాన్ని..

పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట అన్నారు. డిఎంహెచ్ఒ ఛాంబర్‌లో జిల్లా అడ్వయిజరీ కమిటీ సమావేశం (పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్) శనివారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డిఎంహెచ్ఒ శర్మిష్ట మాట్లాడుతూ పిసిఅండ్ పిఎన్‌డిటి యాక్ట్ జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తామని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో వంద స్కానింగ్ సెంటర్లు పని చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా జంగారెడ్డిగూడెం, తినేత్ర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి స్కానింగ్‌కు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారన్నారని, వీటిని ఆమోదించామని తెలిపారు. నిశిత పరిశీలన, తనిఖీలతోపాటు డెకాయ్ ఆపరేషన్లపై దృష్టి సారించామని చెప్పారు. స్కానింగ్ సెంటర్లలో రేట్లను ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. బేటీ బచావో-బేటీ పడావో ద్వారా స్కూలు పిల్లలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో వైద్యులు కె.భాను, శైలజ, శ్రీనివాసరావు, వైవివి.శివరామకృష్ణ, కె.భార్గవి, రోహిత్, ప్రోగ్రాం ఆఫీసరు డి.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న డిఎంహెచ్ఒ శర్మిష్ట

సహకార సంఘాలు రైతుల అవసరాలు తీర్చాలి

జెసి పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

రైతుల అవసరాలను తీర్చేలా సహకార సంఘాలు సేవలందించాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిఅన్నారు. సహకార వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఆమె సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని సన్న, చిన్నకారు రైతులకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, సహకార సంఘాలు విస్తృత సేవలందిస్తున్నాయన్నారు. రైతులు, సభ్యుల అవసరాలను గుర్తించి సకాలంలో సేవలు అందుబాటులోకి తీసుకు రావాలని, పిఎసిఎస్‌ల కంప్యూటరీకరణ సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. డిసిసిబి, పిఎసిఎస్‌ల సిబ్బంది సమిష్టిగా పని చేసి ఏలూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకునకు పూర్వ వైభవం తీసుకు రావాలన్నారు. జిల్లా సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని సహకార సంఘాల, బ్యాంకు సిబ్బంది, సహకార శాఖ అధికారులు సమిష్టిగా పనిచేస్తామన్నారు. సహకార వారోత్సవాల ఇన్‌ఛార్జి ఆర్.శ్రీనివాసరావు మాట్లాడగా బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది సహకార ప్రతిజ్ఞ చేశారు.

మాట్లాడుతున్న జెసి ధాత్రిరెడ్డి

కొల్లేరు సమస్యను పరిష్కరిస్తాం : ఎంపీ

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరు సమస్యకు పరిష్కారం చూపుతామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. మండలంలోని భైరవపట్నం శుభం ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆక్వారంగాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్నారు. మండలాల్లో నెలకోసారి సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా నూతనంగా డైరెక్టర్ పదవులు పొందిన కొడాలి వినోద్, ఆంద్రాజు శ్రీనివాస్, లంక రత్నరావులను సన్మానించారు. అనంతరం భైరవపట్నం కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్‌కు మాతృ వియోగం కలగడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి కమ్మిలు విఠలరావు, పార్టీ మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, బికెఎం నాని, భలే యేసు రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేష్

'చింతలపూడి'కి ప్రాధాన్యంపై సిఎంకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - చింతలపూడి

సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని తొలి ఐదు ప్రాధాన్యతల్లో చేర్చడంపై చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు తాను అసెంబ్లీలో మాట్లాడినట్లు ఎంఎల్‌ఎ వివరించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. భూసేకరణ విషయంలో నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని సభ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

ఎంఎల్‌ఎకు పలువురు కృతజ్ఞతలు

విద్యుత్ కనెక్షన్ల సమస్యను విద్యుత్ శాఖా మంత్రితో మాట్లాడి పరిష్కరించిన చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌కు పట్టాయిగూడెం టిడిపి నేత సూరనేని గోపీనాథ్ (గోపిబాబు) కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు 250 మోటర్ కనెక్షన్లు తక్షణమే ఇవ్వాలని సంబంధిత ఉన్నతాధికారులతో మంత్రి మాట్లాడినట్లు తెలిపారు.

రైతులు సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న ఏలూరు కలెక్టరేట్ వద్ద చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల భూములను బలవంతంగా లాక్కొని కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలను రైతాంగం ప్రతిఘటించాలన్నారు. జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే, చింతలపూడి ఎత్తిపోతల పథకం, ఇతర జాతీయ రహదారుల విస్తరణ కోసం, ప్రభుత్వ, ప్రయివేటు అవసరాల రీత్యా చేస్తున్న భూసేకరణలో రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పి.దావీదు, కె.జగదీష్, బొడ్డు చింతయ్య, పి.డేవిడ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు యనమదల విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని యనమదల జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు కృష్ణా జిల్లా గూడూరు హైస్కూల్లో ఈ నెల 13న జరిగిన జిల్లాస్థాయి సీనియర్ త్రోబాల్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా తరపున పాల్గొని ఇద్దరి విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఎస్.నాగరాజు తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొన్న తొమ్మిదో తరగతి విద్యార్థులు జాజుల మనోజ్‌కుమార్, నక్క అజయ్ బాబు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా తరుపున పాల్గొంటారు. ఆ క్రీడాకారులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఎస్.నాగరాజు, పీడీ టివి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్ పలగాని శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి వరుకూటి వెంకటేశ్వరరావు, పలువురు అభినందించారు.



విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, ప్రముఖులు

ప్రజాసమస్యలపై పోరు ఉధృతం

సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి

సుధారాణి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - టి.నర్సాపురం

ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం చేస్తామని సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి తెలిపారు. ఆ పార్టీ మండల మహాసభలో మండల కార్యదర్శిగా సుధారాణి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ మహాసభలో పది మంది మండల కమిటీ సభ్యులు ఎన్నికయ్యారన్నారు. మండలంలో పేదల భూసమస్యలు పరిష్కరించాలని, ఎర్రకాల్వ మిగులు భూములు పేదలకు పంచాలని, ఏక్‌సాల్ పట్టాలివ్వాలని కోరారు. మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించినట్లు తెలిపారు. సమావేశంలో అనుమోలు మురళీ, గుడెల్లి వెంకట్రావు, మడకం కుమారి, బరగడ కుమారి, మండ్రు శిరీష, బుద్దుల రామలక్ష్మి, పూసం చిన్న సూర్యారావు, ఎస్.దుర్గమ్మ, బుద్దుల గంగాభవాని పాల్గొన్నారు.

18న విజయవాడలో ధర్నా: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న విజయవాడలో మహాధర్నాను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.లెనిన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లెనిన్ మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు పెంచాలని, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.అభిలాష్, ఉదయ్, కిరణ్, గణేష్, భవ్య, కావ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గ్రామాల అభివృద్ధికి ఆయా పంచాయతీలు ప్రణాళికలు రూపొందించాలని ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి ఆదేశించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పంచాయతీ అభివృద్ధి, ప్రణాళికపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి పంచాయతీల ద్వారా వచ్చే ఆదాయంతోపాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులను సక్రమంగా వినియోగించుకునేలా ముందస్తు ప్రణాళికలు అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ కె.శ్రీనివాస్, హెచ్ఒ నవీన మణిమాల, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపుపై అర్జీల నమోదు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక 16వ డివిజన్లో ఇళ్ల స్థలాల కేటాయింపుపై అర్జీల నమోదు శనివారం చేపట్టారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు భూమి పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పేదల సొంతింటి కలను నిజం చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు ఉప్పులూరి హేమశంకర్, కొండేటి రాంబాబు, జిజ్జావరపు సురేంద్ర పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాట్రాయి

చనుబండ పిహెచ్‌సి పరిధిలోని కృష్ణారావుపాలెంలో వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో 104 వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. దీనిలో 48 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ దుర్గాప్రసాద్ స్థానిక అంగన్వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. అక్కడ పిల్లలను పరిశీలించి, సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సత్యవాణి, ఎఎన్ఎం సరోజిని, వైద్య సిబ్బంది సరోజిని, శాంతి, ఆశాలు పాల్గొన్నారు.

ఏలూరు కాల్వపై చెట్ల నరికివేత

నరికిన చెట్లు

ఉంగుటూరు: ఏలూరు ప్రధాన కాలువ వెంబడి ఏళ్ల వయస్సు నాటి నిద్రగన్నేరు చెట్లను ఇరిగేషన్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో యంత్రాల సాయంతో శనివారం నరికేశారు. చెట్ల కొమ్మలు ఒరిగిపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉంటున్నాయని, తూడు, చెత్త కాలువ నీటిలో ఆగిపోతున్నాయనే కారణంగా చెట్ల కొమ్మలను మాత్రమే తొలగిస్తున్నామని ఇరిగేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే నీటి ప్రవాహానికి అడ్డులేని చెట్లను సైతం నరికేస్తున్నారని పర్యావరణ కార్యకర్తలు అంటున్నారు.

చేపల కూర వండటం ఆలస్యమవుతోందని..!

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

భార్య చేపల కూర వండడం ఆలస్యమవుతోందని అనడంతో మనస్తాపానికి గురైన భర్త ఇంటి పక్కనే ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు రూరల్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం నాగేంద్ర కాలనీకి చెందిన తంజంగారి మాణిక్యంరెడ్డి (60) స్థానికంగా రిక్షా పుల్లర్‌గా పని చేస్తూ భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ముగ్గురికి వివాహాలయ్యాయి. శనివారం రిక్షా పని ముగించుకుని మాణిక్యం చేపలు కొనుగోలు చేసి ఇంటికి చేరాడు. వాటిని వండమని భార్యను కోరాడు. దీనికి ఆమె ఇంట్లో పూజ జరుగుతుందని, కూర వండడానికి ఆలస్యమవుతుందని తెలిపింది. దీనిపై మనస్తాపానికి చెందిన మాణిక్యం ఇంటి పక్కనే ఉన్న గానుగ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బంధువులు వెంటనే అతని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ఆస్పత్రికి తరలించారు.

గ్రామీణ మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - దెందులూరు

మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్

గ్రామాల్లోని ప్రతి మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తంకుమార్ మాట్లాడుతూ మహిళా అభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు, వారి రక్షణకు ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కల్పించడమే ఈ సదస్సు ముఖ్యోద్దేశమన్నారు. గృహహింస, వరకట్న వేధింపులు, బాలికలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాధితులకు పరిహారం అంశాలపై అవగాహన కల్పించారు. ఏలూరుతోపాటు అన్ని కోర్టుల పరిధిలో మండల న్యాయ సేవాధికార సంస్థలు పని చేస్తున్నాయన్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం లేదా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి కేసులను వాదిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, నూజివీడు డిఎస్‌పి కెవిఎస్ఎల్‌వి.ప్రసాద్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ పి.పద్మావతి, తహశీల్దార్ బి.సునీత, భీమడోలు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ప్రజాశక్తి - మండవల్లి


మండవల్లి : గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు వినియోగించుకుంటే విజయం వారి సొంతమని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.రామలింగేశ్వరరావు తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రంథాలయాల్లో ఎంతో గొప్ప విజ్ఞానం దాగి ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.కొండలు, పాఠశాల లైబ్రేరియన్ మల్లేశ్వరరావు, గ్రంథాలయ నిర్వాహకురాలు షేక్ పర్వీన్ పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛ ఉండాల్సిందే

ప్రజాస్వామ్యం వర్థిల్లాలి అంటే పత్రికా స్వేచ్ఛ ఉండాల్సిందేనని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కర్ స్పష్టం చేశారు. 16వ పత్రిక దినోత్సవం సందర్భంగా స్థానిక గ్రంథాలయం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విలేకరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ పత్రికలకు స్వేచ్ఛ లేకపోతే నిరంకుశత్వానికి దారి తీస్తుందన్నారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలు, అవినీతిని పత్రికల ద్వారా ప్రజల ముందుకు తీసుకొచ్చి సమాజానికి ఎంతో మేలు చేస్తారన్నారు.

ఏలూరు సిటీ: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం మూడో రోజు ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రంథాలయ పితామహులైన డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు ముఖ్య అతిథి వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్.విజయ్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై అవగాహనా సదస్సు చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఎస్.గణపతి, జాయింట్ సెక్రటరీ నరసింహారావు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఎంఇఒ టి.రామ్మూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయాల విశిష్టతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రామ్మూర్తి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, హెడ్ కానిస్టేబుల్ నారాయణరావు, వ్యాయామోపాధ్యాయుడు కె.రాజు పాల్గొన్నారు.

ముసునూరు: గ్రంథాలయోద్యమ నాయకులను స్మరించుకోవడం చాలా ఆనందదాయకమని గ్రంథాలయ అధికారి టి.రాజేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని ముసునూరు గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకటరమణ, పాతూరి నాగభూషణం వంటి నాయకులను గురించి విద్యార్థులకు తెలియజేయడం, వారి జీవిత చరిత్రలపై అవగాహన కల్పించారు.

కలిదిండి: స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు తెలిపారు. పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు - సోషల్ మీడియా వల్ల కలిగే నష్టాలు అనే అంశంపై స్థానిక పాఠశాలల నుండి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం

ప్రజాశక్తి - ఉంగుటూరు

అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎంపిడిఒ

జాతీయ రహదారిపై నారాయణపురం జంక్షన్ వద్ద, నారాయణపురం నుంచి గణపవరం వెళ్లే మార్గంలో అనేకచోట్ల ఆక్రమణలు ఎక్కువ ఉన్నాయి. వాటివల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులకు పలు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో శనివారం ఎంపిడిఒ జిఆర్.మనోజ్ అధ్యక్షతన ట్రాఫిక్ సమస్యపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిటి వై.పూర్ణ ప్రసాద్, ఎస్ఐ సూర్యభగవాన్, పంచాయతీ విస్తరణాధికారి మాట్లాడుతూ పంచాయతీ, రెవెన్యూ, సర్వే సిబ్బందికి ఆక్రమణల తొలగింపుపై దిశానిర్దేశం చేశారు. రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్ల, దుకాణాల యజమానులు ఎవరికి వారు ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. పంచా యతీ సిబ్బంది ఆక్రమణదారులందరికి నోటీసులు జారీచేసి ఆక్రమణల తొలగింపునకు సమిష్టిగా పనిచేయాలని ఎంపిడిఒ సూచించారు.

ప్రజాశక్తి - మండవల్లి

ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గ ప్రసాద్ అన్నారు. స్థానిక పిహెచ్‌సిలో డాక్టర్ ఎల్.కిరణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో శనివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు వాతావరణంలో నెలకొన్న మార్పులతో ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని, మందులను అందుబాటులో ఉంచి వైద్యం అందించాలని అన్నారు. వైద్యశాలకు అవసరాలపై చర్చించారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండవల్లి, రుద్రవరం సర్పంచులు మెండ ఝాన్సీ, బోనం శేషగిరి, గుడివాడ మురళి, సిహెచ్ఒ శ్రీనివాసరావు, మెండ సురేష్ పాల్గొన్నారు.

బంగారం పేరిట మోసం: ముఠా అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

తమ వద్ద పెద్ద మొత్తంలో బంగారం ఉందని, దాన్ని తక్కువ ధరకే ఇస్తామని నమ్మించి మోసగించిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ వివరించారు. కృష్ణా జిల్లా పెడన మండలం చెన్నూరు గ్రామానికి చెందిన పంద్రాజు రవీంద్రకుమార్ ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం శ్రీహరి గ్రామంలో నాలుగు సంవత్సరాలుగా చేపలు, రొయ్యల చెరువులు సాగు చేస్తున్నాడు. గతంలో అతని వద్ద నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం మల్లాలుపేటకు చెందిన దబ్బ ఈశ్వర్ పని చేశాడు. ఈశ్వర్ కొద్దిరోజుల క్రితం రవీంద్రకు ఫోన్ చేసి తన వద్ద బంగారం ఉందని, చాలా తక్కువ ధరకే ఇచ్చేస్తానని నమ్మబలికాడు. గత నెల 23న ముదినేపల్లి మండలం సింగరాయపాలెం సెంటర్‌కు రావాలని ఈశ్వర్ రవీంద్రకు చెప్పాడు. అక్కడికి వెళ్లిన రవీంద్రకు ఈశ్వర్ ఒక బంగారు పూసల దండను ఇచ్చాడు. దానిలో మూడు పూసలను రవీంద్ర పరీక్షించుకుని బంగారమేనని నిర్ధారించుకున్నాడు. ఈశ్వర్ వద్ద బంగారం కొనుగోలు చేసేందుకు రూ.5 లక్షలు అడ్వాన్స్ ఇచ్చాడు. మరుసటి రోజు బంగారు పూసల దండలన్నీ ఇచ్చేలా, దానికి రూ.20 లక్షలుగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈశ్వర్ బృందం మరుసటి రోజు రవీంద్రను విజయవాడ రావాలని సూచించి తర్వాత గుంటూరు రావాలని సూచించారు. జాతీయ రహదారి 16లో వెంకటాచలం గ్రామ సమీపంలో రవీంద్రను ఈశ్వర్ ముఠా కలిసింది. ఒక్కసారిగా ఈశ్వర్ ముఠా రవీంద్రపై దాడికి పాల్పడి అతని వద్ద ఉన్న రూ.15 లక్షల నగదు లాక్కుని పరారయ్యారు. దీనిపై కైకలూరు రూరల్ పోలీస్ స్టేషన్లో రవీంద్ర ఫిర్యాదు చేశాడు. రూరల్ సిఐ రవికుమార్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అత్యాధునిక పరిజ్ఞానంతో ముఠాలోని ముగ్గురు వ్యక్తులను చాకచక్యంగా శనివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.16 లక్షల నగదు, నకిలీ బంగారు పూసల దండలను, నిందితులు వినియోగించిన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈశ్వర్‌తో పాటు నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం మల్లాలిపేట ప్రాంతానికి చెందిన బాణావత్తు చిన్న, చిత్తూరు జిల్లా వేంపాడు మండలం ఈశ్వర్ కాలనీకి చెందిన భూక్య సాగ్రమ అలియాస్ శ్యామ్‌లను అరెస్ట్ చేశామని తెలిపారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారికోసం గాలిస్తున్నామని చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్, కైకలూరు సిఐ రవికుమార్ ముదినేపల్లి ఎస్ఐ సూర్య రామచంద్రరావు, కలిదిండి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు, సిబ్బందిని ఎస్‌పి అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు సిబ్బంది పాల్గొన్నారు.

బేటి బచావో - బేటి పడావో

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని చినతాడినాడ జెడ్‌పి హైస్కూల్లో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా జరిగిన బేటి బచావో-బేటి పడావో కార్యక్రమంలో కైకలూరు ఐసిడిఎస్ పిఒ జి.కరుణ కుమారి మాట్లాడారు. బాలల హక్కులు, రక్షణ, మానసిక వికాసం, వారి జీవన శైలి, బాల్యవివాహాలు, బాలల హక్కుల చట్టాల గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యం, ఫిస్టేనమ్మ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో సర్పంచి బట్టు లీలా కనక దుర్గామహేష్ పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ సూపర్వైజర్ భూపతి సుందరమ్మ, హెల్త్ సూపర్వైజర్ సాల్మ గ్లోరి, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

మండవల్లి: బాలల హక్కులపై అవగాహన పెంచుకొని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగలక్ష్మి అన్నారు. బాలల దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా చింతపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం బాల్యవివాహాలు వల్ల కలిగే నష్టాలు, అనర్థాలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులపై చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని ఎం.నాగులపల్లి యుపి స్కూల్‌లో బాల బాలికల హక్కులు, చట్టాలపై అవగాహనా సదస్సును సూపర్‌వైజర్ కె.మణి నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం విజయలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు టి.లక్ష్మి, కె.సుజాత, జి.జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **SULTANEMOBEEN,** W/o.MEER RAHAMATH ALI, resident of D.No.6B-2-54, resident of Eluru, Eluru Mandal, Eluru Dist, A.P have changed my name from **MOBEENA SULTHANA MEER** (Old Name) to **SULTANEMOBEEN** (New Name). Hence forth Iam being called as **SULTANEMOBEEN** (New Name) for all purposes.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, తాడేపల్లిగూడెం

ఇ.పి.నెం.9/2024 ఇన్ ఓ.ఎస్.నెం.212/2022

బిట్వీన్:

రెడ్డి సత్యనారాయణ ...డి. హెచ్. ఆర్ /ప్లెయింటిఫ్

మద్దుకూరి నాగేశ్వరరావు ...జె.డి.ఆర్ /డిఫెండెంట్

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఆస్థి వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ బాకీ గాను ప్రతివాది /జె.డి.ఆర్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి **ది. 28-11-2024 వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పై కోర్టులో వేలం వేయబడును.** షరతులు తెలుసుకొని పాడుకొనవలెను.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, జగన్నాదపురం గ్రామం తాలూకు వ్యవసాయ భూమి bearing R.S.No.115 to an extent of Ac.0-60 Cents of Agriculture land bounded by:
East: Talla Venkateswarao's Land.
South: Maddhukuri Ramarao's Land.
West: Land of Siddhina Sirisha.
North: Siddhina Venkataswararao's Land. & Etc., Land.

పై హద్దుల మధ్య య.0-60 సెంట్లు గల వ్యవసాయ భూమి సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.
వాది /డి.హెచ్.ఆర్ వాల్యూ /కిమ్మత్తు : రూ.10,00,000/-
అమీనా వాల్యూ /కిమ్మత్తు : రూ.20,00,000/-

MUTYALA SUNIL KUMAR
Advocate for D.H.R.
Tadepalligude.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 335/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది

మరియు

D-1) కాసాని సీతారామయ్య అండ్ అనదర్ ...ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:

D-1: కాసాని సీతారామయ్య, S/o. పెదముసలయ్య, డోర్ నెం. 5-107, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 20-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 15-11-2024 సెల్: 98662 59514

ఏలూరు జిల్లాలోనే గణపవరం విద్యాశాఖ..!

250 మంది ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు

గతంలో ఎన్నికల విధులు.. ఇప్పుడేమో శిక్షణ

యుటిఎఫ్, పిడిఎఫ్ ఎంఎల్‌సిల పోరాట ఫలితంగా పశ్చిమ విద్యాశాఖ ఆధీనంలోకి తీసుకొస్తూ ప్రొసీడింగ్స్

అమలు కాని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలు

18 మంది ఉపాధ్యాయులకు ఏలూరు జిల్లాలో నీటిసంఘం ఎన్నికల విధులు


File No.ESE02-12021/110/2022-EST 2-CSE-Part(3)

PROCEEDINGS OF THE DIRECTOR OF SCHOOL EDUCATION
ANDHRA PRADESH
Present: Sri Vijay Rama Raju.V., I.A.S.,

Rc.No. ESE02-12021/110/2022-EST 2-CSE-Part(3) Dt:16/10/2024

Sub: School Education Department - A.P.E.S - Shift the Ganapavaram Mandal from Eluru Education Division, Eluru District, to Bhimavaram Education Division, West Godavari District - Certain Instructions Issued.

Read: 1) G.O.Ms.No.62, Finance (HR.I-PLG.&POLICY) Dept, Dt:03.04. 2022.
2) This office Procgs.Rc.no.ESE02-11021/67/2022-JD-VE-CSE, Dt:04.04.2022
3) Lr.Rc.No.ESE02-12021/110/2022-EST2-CSE,Dated:05/06/ 2022.
4) G.O.Ms.No.51, Revenue (Lands.IV), dated 16.02.2023
5) G.O. Ms. No. 56 SE eServices-1. Dept., dated 20-06-2023.
6) This office Procgs.Rc.no.ESE02-11024/13/2023-EST 1-CSE, Dated:07.08.2023.
7) Lr.No.100/2024, dated:06.08.2024 of A.P. United Teacher's Federation.

&&&&&

The attention of the Regional Joint Director of School Education, Kakinada is drawn to references read above, and it is informed that in the references 1st and 2nd read above, the Government has issued orders regarding provisionally allocated the cadre strength of the Commissioner of School Education in the District Offices amongst the 26 restructured districts and the same was communicated to the offices concerned in the state.

Further, in the references 3rd and 5th read above, the Government issued orders restructuring the existing (53) Educational Divisions into (74) Educational Divisions within the restructured districts by reallocating the existing Deputy Educational Officer posts in district offices to ensure that each of the 74 Revenue Division has one Deputy Educational Officer post, thereby strengthening the divisional supervisory structure of School Education Department in the districts. Subsequently, the same was communicated to all District Educational Officers in the state vide reference 6th cited.

In the reference 4th read above, the Government transferred the Ganapavaram Mandal from Eluru Revenue Division in Eluru District to the Bhimavaram Revenue Division in West Godavari District, as detailed in the appended Schedule-I (Copy enclosed).

Therefore, the Regional Joint Director of School Education, Kakinada ...

డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జారీ చేసిన ప్రొసీడింగ్ కాపీ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాల పునర్విభజన జరిగి రెండేళ్లు దాటినా కొన్ని శాఖల పరిపాలన అంతా ఏలూరు నుంచే సాగుతోంది. వీటిలో కొన్ని ముఖ్యమైన శాఖలు ఉండటంతో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేపట్టి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాను ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలుగా ఏర్పాటు చేసింది. అయితే జిల్లా పునర్విభజన తర్వాత ఏలూరు జిల్లా పరిధిలో ఉన్న గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో కలిపారు. 2023 ఫిబ్రవరి 16న రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేసింది. తర్వాత గణపవరం మండలంలోని విద్యాశాఖ మినహా అన్ని శాఖలను పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేశారు. దీంతో గణపవరం మండలం విద్యాశాఖ ఏలూరు జిల్లాలోనే కొనసాగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో సుమారు 250 మంది ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, విద్యాశాఖ అధికారులు సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సైతం అవస్థలు తప్పలేదు. గణపవరం మండలం ఉపాధ్యాయులకు ఏలూరు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎన్నికల అధికారులు కూడా ఆ జిల్లా నుంచి ఈ జిల్లాకు ఉపాధ్యాయులను తిప్పడంతో వారు పడ్డ ఇబ్బందులు వర్ణనాతీతం. అలాగే సబ్జెక్టు టీచర్లు వర్క్‌షాప్స్, సమావేశాలు, పదో తరగతి పరీక్షల మూల్యాంకం విధులకు హాజరు కావడానికి సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ, పిడిఎఫ్ ఎంఎల్‌సిల పోరాట ఫలితంగా గణపవరం మండల విద్యాశాఖను పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోకి తీసుకొస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ గత అక్టోబర్ 16న ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీని ఆధారంగా గణపవరం మండల విద్యాశాఖకు సంబంధించిన అన్ని ఆపరేషన్స్ భీమవరం డిఇఒ కార్యాలయం కేంద్రంగా జరపాలని స్పష్టత కూడా ఇచ్చారు. అయినప్పటికీ పదో తరగతి విద్యార్థుల నామినల్ రోల్స్ విషయంలో పశ్చిమగోదావరి జిల్లాకు బదులు ఏలూరు జిల్లా అని చూపిస్తున్న పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఏం చేయాలో అర్థం కాక ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. దీనిని తక్షణమే మార్చాలనే డిమాండ్ ఉంది. పదో తరగతి పరీక్షలకు సంబంధించిన మీడియం ఆప్షన్‌ను ఎడిట్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చినట్టుగానే నామినల్ రోల్స్‌లో జిల్లా ఆప్షన్‌నూ ఎడిట్ చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే ఏలూరు జిల్లా పరిధిలో జరుగుతున్న నీటి సంఘం ఎన్నికలకు గణపవరం మండలానికి చెందిన 18 మంది ఉపాధ్యాయులకు విధులు కేటాయించి శిక్షణకు హాజరవ్వాలని ఆర్డర్స్ కాపీలను వాట్సాప్‌లో పంపించడం చర్చనీయాంశమైంది. పశ్చిమలో పూర్తిస్థాయిలో విలీనమైనప్పటికీ ఈ విధంగా విధులు కేటాయించడం సరికాదని, వీటిని పున్ణపరిశీలించి సమస్యను పరిష్కరించాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తోంది.

అన్ని విభాగాలనూ విలీనం చేయాలి

జిడి.భవానీప్రసాద్, యుటిఎఫ్ గణపవరం మండల ప్రధాన కార్యదర్శి

యుటిఎఫ్, పిడిఎఫ్ ఎంఎల్‌సిల కృషి ఫలితంగా గణపవరం విద్యాశాఖను పశ్చిమలో విలీనం చేశారు. విద్యాశాఖకు సంబంధించిన సమాచారం అటు ఏలూరు జిల్లా, ఇటు పశ్చిమగోదావరి జిల్లాల నుంచి గణపవరం మండలానికి వస్తున్నాయి. దేనిని అనుసరించాలో తెలియక ఉపాధ్యాయులతోపాటు అధికారులు సైతం గందరగోళానికి గురవుతున్నారు. గణపవరం మండల విద్యాశాఖ అన్ని విభాగాలనూ పూర్తిస్థాయిలో పశ్చిమగోదావరి జిల్లాలో విలీనం చేసి ఉపాధ్యాయుల ఇబ్బందులను తొలగించాలి.

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో

E.P. No. 84/2013 in OS. No. 151/2007

బిట్వీన్:
1.కోనాల వీర వెంకట సత్యనారాయణ రెడ్డి **(died)**
2.కోనాల వెంకట రెడ్డి ....డిక్రీ హోల్డర్స్
(as per orders in EA72/24, dt. 07-05-2024) 2nd DHR is added

Vs

రేపాక ఆనందరావు
టు ....జడ్జిమెంట్ డేట్టార్
రేపాక ఆనందరావు
S/o ఇజ్రాయేలు, వయసు 55 సం.రాలు
దిగమర్రు, పాలకొల్లు మండలం

పై నెంబరు EP గ్రంథములో జడ్జిమెంట్ డేట్టార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది. 04-12-2024వ తేదీన ఉ.గం. 10-30 ని.ల** లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

Item.No.1: పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు సబ్-రిజిస్ట్రారులో చేరిన పాలకొల్లు మండలం, దిగమర్రు గ్రామంలో **య.1.00 సెంట్లు RS no.312లో దక్షిణం వైపున గల య.0.50 సెంట్లు భూమికి హద్దులు.**

తూర్పు	:	రేపాక కాసులు గారి భూమి
పడమర	:	కొల్లాబత్తుల మేరి సుశీల గారి భూమి
దక్షిణము	:	మురుగు కాలువ
ఉత్తరం	:	మందపాటి పెద్దిరాజు గారి భూమి

అమీనా విలువ Rs. 2,00,000/-
DHR విలువ Rs. 1,90,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

యం. వెంకట రామిరెడ్డి
పాలకొల్లు అడ్వకేటు
ది.16-11-2024

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 229/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం -వాది

మరియు

D-1) కట్టా వెంకటరావు
D-2) వేముల అశ్వనికుమార్ ...ప్రతివాది/ప్రతివాదులు

సమన్స్ టు:

D-1: కట్టా వెంకటరావు, S/o. తాతయ్య, డోర్ నెం. 4-112, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: వేముల అశ్వనికుమార్, S/o. భాస్కరరావు, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 20-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 15-11-2024 సెల్: 98662 59514